వెదజల్లు సాగు.. లాభాలు బాగు

- ఖరీఫ్‌లో అధిక దిగుబడులకు మంచి అవకాశం
- భారీగా తగ్గుతున్న పెట్టుబడి ఖర్చు
- అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటనందూరు: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం, కూలీలు, ఎరువులు, పురుగు మందుల సమస్యను అధిగమించేందుకు రైతులు ఖరీఫ్‌లో వెదజల్లు విధానాన్ని అవలంబించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తుంది. ఈ విధానంలో నారుతీత, నాట్లు ఖర్చు ఉండకపోగా విత్తనాలు, కూలీలకు అయ్యే ఖర్చు భారీగా తగ్గుతుంది. తెగుళ్లు, ఎలుకల బెడద కూడా తక్కువగా ఉండి ఎకరాకు రూ.10 వేల వరకూ పెట్టుబడి ఆదా అవుతోంది. సాధారణ విధానం కన్నా ఈ విధానంలో ఎకరాకు ఐదారు బస్తాల దిగుబడి సైతం అధికంగా వస్తుంది. దీంతో ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి వెదజల్లు విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

40 వేల ఎకరాల్లో...

ఈ ఏడాది తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో రైతులు 40 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారుల అంచనా. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయాధికారులు వరిలో వెదజల్లు పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఖరీఫ్ ఆలస్యం కావడం వల్ల రబీలో సాగు చేసే అపరాల సాగులో కూడా జాప్యం జరిగి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఈ పరిస్థితిని అధిగమించాలంటే వెదజల్లు విధానం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగునీటి వసతి లేని రైతులు, తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు సాధించాలనుకునే రైతులను వెదజల్లు విధానం వైపు అడుగులేయాలని ప్రోత్సహిస్తున్నారు.

సాగు విధానం ఇలా..

వేసవి దుక్కి చేసిన పొలంలో ఎదిగిన గడ్డి, పిచ్చిమొక్కలను దమ్ములో కలియదున్ని వారం రోజులు ఉంచితే పొలం సారవంతమవుతుంది. ఇలా దమ్ము చేసిన పొలాన్ని సమాంతరంగా తయారు చేసి నాటడానికి 24 గంటల ముందు వరి విత్తనాలను నానబెట్టి



కోటనందూరులో వెదజల్లు పద్ధతిలో వరి విత్తనాలు చల్లిన పొలం (ఫైల్)

చిన్నగా మొలకెత్తిన తరువాత ప్రతి రెండు మీటర్లకు కాలి బాట ఉండే విధంగా విత్తనాలు చల్లుకోవాలి. విత్తనాలు దూరంగా నాటడం వల్ల గాలి, వెలుతురు అధికంగా ఉండి పంట ఆశాజనకంగా ఎదుగుతుంది.

కలుపు నివారణ..

విత్తనం వేసిన తరువాత రోజే కలుపు మందు పిచికారీ చేసుకోవాలి. విత్తనం వేసిన మూడు రోజుల తరువాత సాతి అనే కలుపు మందును స్ప్రే చేసుకోవాలి. వారం తరువాత టాప్‌స్టార్ మందును పిచికారీ చేయాలి. విత్తనాలు చల్లిన 15 నుంచి 20 రోజుల తరువాత కలుపు నివారణకు ఎకరాకు 80–100 గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ పిచికారీ చేయాలి.

విత్తనాల ఖర్చు ఆదా

సాధారణ విధానంలో ఎకరాకు 30 నుంచి 35 కేజీల వరి విత్తనాలు చల్లాల్సి ఉండగా ఈ విధానంలో **10–12** కేజీల విత్తనాలు చల్లితే సరిపోతుంది. ఈ విధానంలో నారుమడి తయారీ, నారుతీత, నాట్లు వేసే ఖర్చు ఉండదు. కాలిబాటలు ఉండే విధంగా విత్తనాలు చల్లడం వల్ల గాలి, వెలుతురు మెండుగా ఉండి పంట భారీగా ఎదిగి ఎకరాకు ఐదారు బస్తాల వరకూ అధిక దిగుబడి వస్తుంది.

ఎరువులు, పురుగు మందుల వినియోగం తక్కువ

ఈ విధానంలో ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం ఎంతో కీలకం. వ్యవసాయధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులు వాడాలి. ఈ విధానంలో పంట ఆశాజనకంగా ఎదుగుతుంది కనుక అధిక మోతాదులో ఎరువులు వాడితే పంట మరింత ఎక్కువగా ఎదిగి నేలనంటే ప్రమాదం ఉంది.

కూలి రేట్లు భరించలేకపోతున్నాం



ప్రస్తుతం వ్యవసాయ కూలి రేట్లు భారీగా పెరిగిపోయాయి. దానికితోడు అవసరానికి కూలీలు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రెండేళ్లుగా వరి వెదజల్లు పద్ధతిలో సాగు చేశాను. తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు వచ్చాయి. పెట్టుబడి భారీగా తగ్గి, కూలీల సమస్యకు పరిష్కారం దొరికింది.

చెల్లారావు, రైతు, కోటనందూరు

తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు



వెదజల్లు పద్ధతిలో పెట్టుబడి తక్కువగా ఉంటుంది. నారుమళ్ల తయారీ, నారుతీత, నాట్లు ఖర్చు ఉండదు. కూలీలు, సాగు నీటి వినియోగం, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటాయి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు వాడితే అధిక దిగుబడులు వస్తాయి. పంటకు ఆరుతడి సరిపోతుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు వెదజల్లు సాగు వైపు అడుగులేస్తే మంచిది.

కె.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

క్లుప్తంగా

కనకదుర్గమ్మకు చండీ హోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద **వేంచేసిన** కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం '**మూల**' సందర్భంగా సోమవారం అమ్మవారికి **చండీ** హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు సంతోష్ ఘనపాఠి, గంగాధరబట్ల శర్మ, ప్రయాగ రాంబాబు, నర్సింహమూర్తి, కూచిమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రమణాగౌడ్‌కు మంత్రి రాజా పరామర్శ



రమణాగౌడ్‌ను పరామర్శిస్తున్న మంత్రి రాజా, నాయకులు

తుని: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రేలంగి సూరిబాబు కుటుంబాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం సాయంత్రం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ తండ్రి సూరిబాబు ఇటీవల మరణించారు. మంత్రి రాజా రమణాగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, తొండంగి మండలం వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



తునిలో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తుని: వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ అల్లాడ దివాణం కోరారు. పట్టణంలోని 9వ సచివాలయంలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. అప్తామాలిస్ట్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో 60 ఏళ్లు పైబడిన పలువురికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. కంటిచూపు సరిగ్గా లేకపోతే వైద్య పరీక్షలు తర్వాత ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని ఆయన తెలిపారు. ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు క్రికెట్ టోర్నీ ప్రారంభం

తుని: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా డీఆర్ఎఫ్ క్రికెట్ టోర్నీని మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు సోమవారం తెలిపారు. తుని నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో జట్లు పాల్గొంటున్నాయన్నారు. విన్నర్స్‌కు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.50 వేలు ప్రైజ్‌మనీగా అందిస్తామన్నారు. తునికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



రౌతులపూడిలో బాధితులకు సాయం అందజేస్తున్న రమణమ్మ, శ్రీను దంపతులు

రౌతులపూడి: స్థానిక ఎస్సీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, శ్రీను దంపతులు చేయూతను అందించారు. ఇళ్లు కోల్పోయిన నాలుగు బాధిత కుటుంబాలకు సోమవారం ఒక్కొక్కరికి రూ.2000తో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, బి.రాజేశ్వరరావు, వై.సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



సినిమా సెంటర్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం



ట్రాఫిక్ సమస్యకు మోక్షమెప్పుడో ?

సోమవారం 'సాక్షి'లో వచ్చిన కథనం

అన్నవరం: స్థానిక మెయిన్ రోడ్‌లో ఆక్రమణలను అధికారులు తొలగించారు. గ్రామంలో ఆక్రమణలు పెరిగిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో సోమవారం 'సాక్షి'లో ట్రాఫిక్ సమస్యకు మోక్షమెప్పుడో ? అనే శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రొక్లెయిన్‌తో సినిమా సెంటర్‌లోని పలు లాడ్జిల ముందు ఆక్రమణలను తొలగించారు. మెయిన్ రోడ్‌పై సగానికి పైగా రోడ్డును లాడ్జి యజమానులు ఆక్రమించి షెడ్లు వేశారు. కొన్ని లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు కూడా నిర్వహిస్తున్నట్లు ప్రచారం జోరుగా జరుగుతోంది.

సాక్షి ఇంపాక్ట్

కాగా రోడ్డు మధ్యలో లాడ్జి బోర్డులు ఇంకా అలాగే ఉన్నాయి. వాటిని కూడా తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈనాం భూమి సమస్యను పరిష్కరించాలి



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న లిబరేషన్ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: చింతలూరులోని ఈనాం భూమి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు ఏనుపాటి అర్జునరావు, కె.జనార్దన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రత్తిపాడులో చింతలూరు ఈనాం భూమి సాగుదారుల కమిటీ అధ్యక్షుడు దుమ్ముల సింహాచలం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యాలయం నుంచి నంది సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చిబాబు మాట్లాడుతూ చింతలూరులో సాగు చేస్తున్న రైతులకు భూమిపై హక్కు లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా రైతుల సాగులో ఉన్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తూము చెల్లబాబు, జంకల అప్పారావు, లోడ అప్పారావు, మాస రాజమణి, బైపా చిట్టెమ్మ, గండేటి సన్యాసిరావు, కడంపల్లి నాగు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



ఏలేశ్వరంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం విద్యార్థులు మొక్కలు నాటారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కలు పెంచడం ద్వారా ద్వారా పర్యవరణాన్ని పరిరక్షించవచ్చొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెన్నా శ్రీను, ముప్వల లోవప్రసాద్, గంగాధర్ పాల్గొన్నారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

జగ్గంపేట: కాట్రావులపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 10 మంది అదుపులోకి తీసుకున్నట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కాట్రావులపల్లి శివారులో పేకాడుతున్నట్టు ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న 10 మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.24500 స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో సారా అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ సోమవారం తెలిపారు. శంఖవరం మండలం కత్తిపూడిలో 10 లీటర్ల సారా, బైక్‌తో గ్రామానికి చెందిన బోదపడి గోవింద్‌ను, ఐదు లీటర్ల సారాతో సీతంపేటకు చెందిన నామాల అప్పారావును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వెంకన్నదొర, సిబ్బంది ఆర్.దొరబాబు, ఎ.రాజు, ఎ.సలామ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయసేకరణ

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో మంగళవారం ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించనున్నారు. కొత్తపల్లి మండలంలోని ఏవీ నగరం, యు.కొత్తపల్లి మండలంలోని రమణక్కపేట, పొన్నాడ గ్రామాల్లోని కేఎస్ ఈజెడ్ పరిధిలో మెసర్స్ కాకినాడ ఎస్ఈజెడ్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

హాల్ టికెట్లు విడుదల

తుని రూరల్: ఏపీ మోడల్ స్కూళ్లలో ప్రవేశ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు విడుదలైనట్టు హంసవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.పద్మజ సోమవారం తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి గాను హంసవరం మోడల్ స్కూల్లో ప్రవేశానికి ఈ నెల 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎంట్రాన్స్ టెస్టు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కిర్లంపూడి: జీవనోపాధి చేపల వ్యాపారాన్ని వదిలి, అక్రమ ధనార్జనే లక్ష్యంగా చేసుకున్న వ్యక్తి ఇప్పుడు కటకటాలు లెక్కపెడుతున్నాడు. అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలను కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు విలేకర్లకు వెల్లడించారు. అడ్డతీగల మండలం కోనలోవ గ్రామానికి చెందిన శొంఠెపు శ్రీను చేపల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మరింత ఎక్కువ డబ్బు సంపాదించాలనే కాంక్షతో ఎవరికీ అనుమానం రాకుండా తను రోజూవారి చేపలు వేసుకొని వెళ్లే ట్రేల్లో సారా ప్యాకెట్లు వేసుకుని కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల్లో విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం రావడంతో స్థానిక ఇన్‌చార్జ్ ఎస్సై విద్యాసాగర్ సిబ్బందితో వెళ్లి సోమరాయణంపేట శివారున తనిఖీలు చేశారు. సారా విక్రయిస్తున్న శ్రీనును అదుపులోకి తీసుకుని అతని నుంచి 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మోటార్ బైక్‌ను సీజ్ చేశారు. నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సూర్య అప్పారావు తెలిపారు. ఏఎస్సై రామకృష్ణ, రైటర్ రమణ, హెచ్‌సీ ప్రసాద్, సిబ్బంది సుబ్బిరామిరెడ్డి, పి.శివ, ప్రసాద్, సాయి కీర్తన పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సూర్య అప్పారావు, ఎస్సై సీహెచ్ విద్యాసాగర్

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గండేపల్లి: ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సుబ్బయమ్మపేటకు చెందిన ఉరిమిటి వీరబాబు రంగంపేట మండలంలోని గుర్తు తెలియని వ్యక్తి వద్ద 30 లీటర్ల సారాను కొనుగోలు చేసి తన ద్విచక్ర వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి సారా స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

జూదాలకు దూరంగా ఉండాలి

శంఖవరం: జూదాలకు యువత దూరంగా ఉండాలని అన్నవరం ఎస్సై అజయ్‌బాబు సూచించారు. మండలంలోని కత్తిపూడి కొండవారిపేటలో సోమవారం సాయంత్రం వారధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సారా, గంజాయి, పేకాట, కోడిపందేలు, క్రికెట్ బెట్టింగులు, ఆన్‌లైన్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన యువతపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎస్సై ప్రజలతో ముఖాముఖి నిర్వహించి నేరాలపై ప్రజాభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య వచ్చినా పోలీసులు అండగా ఉంటారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరం ఎస్సై అజయ్‌బాబు

కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు వెంకటసత్యనారాయణ, లారీ యూనియన్ అధ్యక్షుడు గౌతు అర్జబాబు, మహిళా పోలీసు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

పిఠాపురం: విత్తనాలు అధిక రేట్లకు అమ్మితే చర్యలు తీసుకుంటామని పిఠాపురం ఏడీఏ పి.స్వాతి హెచ్చరించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ, లోని పలు విత్తన దుకాణాల్లో సోమవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. కొత్తగా వచ్చిన విత్తనాల శాంపిల్స్ సేకరించారు. విత్తనాలు అమ్మే ముందు మొలక శాతం గుర్తించాలన్నారు. 80 శాతం మొలక లేకపోతే వాటిని విక్రయించరాదన్నారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో చక్రపాణికి పింఛను అందజేస్తున్న వలంటీర్ స్వామి

జగ్గంపేట: మండలంలోని రాజపూడికి చెందిన కందుల చక్రపాణి అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను పింఛను లబ్ధిదారుడు కావడంతో గ్రామ వలంటీర్ మేడిశెట్టి స్వామి సోమవారం కాకినాడ వెళ్లి చక్రపాణికి పింఛన్ సొమ్ము అందజేశాడు. వలంటీర్‌ను స్వామిని అధికారులు, గ్రామ నాయకులు అభినందించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



ఎ.కొత్తపల్లిలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పండితుడు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు వేణుశర్మ విజయేశ్వరస్వామి ఆధ్వర్యంలో పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. కాకినాడకు చెందిన అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- గ్రామాల్లో జోరుగా అవగాహన సదస్సులు

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ కొండలరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో రిలీజ్, రెడ్యూస్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటరును ప్రారంభించారు. పేదలకు దుస్తులు, సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాతదుస్తులు, వస్తువులను సేకరించి రీసైకిలింగ్ చేసి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఏఈలు బంగార్రాజు, అనూష, సిబ్బంది వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రయాగమూర్తి, అధ్యాపకులు శ్రీనుబాబు, శ్రీలక్ష్మి, సత్యగౌరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

కోటనందూరు: మొక్కల పెంపకాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా సోమవారం మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో మొక్కలు నాటారు. బిళ్లనందూరులో ఎంపీపీ శ్రీనివాసు, ఎస్సార్‌పేటలో సర్పంచ్ రుత్తల రాజేశ్వరి, ఇండుగపల్లిలో సర్పంచ్ కుంచే సత్యవతి మొక్కలు నాటారు. పాతకొట్టాంలో వైద్యురాలు సువర్ణప్రియాంక ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగానహ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ కొండలరావు



గోకవరంలో ర్యాలీ చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

ప్రత్తిపాడు రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బొంగుళూరి మధుబాబు, వైస్ ప్రెసిడెంట్ మళ్ల గంగాధర్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్తిపాడు కోర్టు ప్రాంగాణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకం, సంరక్షణతోనే జీవకోటి మనుగడ సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ లింగంపల్లి శివకుమార్, సీనియర్ న్యాయవాదులు ఎ.కుక్కుటేశ్వరరావు, రమణం వీర వెంకటరావు, పిల్లి బాలరాముడు, జూనియర్ న్యాయవాది బెహరా లక్ష్మీప్రసన్న, కోర్టు సూపరింటెండెంట్ సత్యదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సార్‌పేటలో మొక్కను నాటుతున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలి

గోకవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఇందుకూరు రేంజ్ అటవీశాఖ అధికారి వి.దుర్గాకుమార్ అన్నారు. గోకవరం అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పలువురు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. గోకవరంలో పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

గండేపల్లి: పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన జీవన విధానం సాధ్యమని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. మండలంలోని మురారిలో సోమవారం పురుగుమందుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తొలుత రైతులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఎఫ్ఎంసీ కంపెనీ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ రవి అన్నవారపు, కమర్షియల్ డైరెక్టర్ రత్నాకర్, డీజీఎం గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

తుని రూరల్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత సూచించారు. తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో సిబ్బంది, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

జగ్గంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ బి.శ్రీదేవి, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా, రెవెన్యూ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.